క్లుప్తంగా

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత



మృతుడు కుటుంబ సభ్యురాలికి నగదు అందిస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు లక్ష్మీపార్వతినగర్‌లో ఆదివారం పట్టా ఉమాపతి(35) మృతి చెందాడు. ఆయనకు వైఎస్సార్ బీమా వర్తించింది. ఈ మేరకు సచివాలయం సిబ్బంది వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతతో కలిసి మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులకు తక్షణ సహాయం రూ.10 వేలు అందజేశారు. మిగతా నగదు కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి రామకృష్ణ, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, శిరీషా, విమల, వెంకటరెడ్డి, పోలరావు, సాయిబాబు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువులు నిషేధించాలి



మాట్లాడుతున్న జెడ్సీ కృష్ణ

మురళీనగర్: ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ కవర్లు వాడకూడదని జెడ్సీ ఆర్.జి.వి.కృష్ణ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించి, పేపరుతో తయారు చేసిన వాటిని వాడాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ పాపునాయుడు, వలంటీర్లు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

13న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 13న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

రెండు లారీల ఢీ



ఆటోనగర్ సిగ్నల్ పాయింట్‌లో ఢీకొన్న లారీలు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద సోమవారం అర్ధరాత్రి రెండు లారీలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. భెల్ సిగ్నల్ పాయింట్ నుంచి ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ఆటోనగర్‌లో మలుపు తిరుగుతున్న లారీను గాజువాక నుంచి షీలానగర్ వైపు వస్తున్న లారీ ఢీ కొట్టింది. ప్రమాదంలో లారీల ముందు భాగం నుజ్జునుజ్జయ్యాయి. లారీల్లో ఉన్న డ్రైవర్లకు ఎటువంటి గాయాలు కాలేదు.

రెండో రోజూ నిరసన వెల్లువ

- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఆందోళన
- కఠిన చర్యలు తీసుకోవాలంటూ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు



16వ వార్డులో నిరసన ప్రదర్శన చేపడుతున్న వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద వలంటీర్లతో కలిసి నిరసన తెలుపుతున్న అక్కరమాని విజయనిర్మల

ఆరిలోవ: జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై రెండో రోజు మంగళవారం కూడా వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు ఆరిలోవ పోలీస్ స్టేషన్ ఎదుట జీవీఎంసీ 9, 10, 11, 12, 13 వార్డుల పరిధిలోని వలంటీర్లతో కలిసి వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల ఆందోళన చేశారు. పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పవన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ వలంటీర్లు నాలుగేళ్లుగా ప్రజలకు చేరువుగా ఉంటూ నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేశారని చెప్పారు. అటువంటి వలంటీర్లపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. మహిళలు అదృశ్యానికి వలంటీర్లు కారణమని, సంఘ విద్రోహ శక్తులకు ఒంటరి మహిళల సమాచారాన్ని అందిస్తున్నారంటూ వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. పవన్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 12, 13 వార్డుల కార్పొరేటర్లు అక్కరమాని రోహిణి, కెల్ల సునీత, 9, 10, 11, 12, 13 వార్డు వలంటీర్లు, ఆయా వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తి మందారెడ్డి, జగ్గుపిల్లి అప్పలరాజు, కెల్ల సత్యనారాయణ, కన్నేటి సుబ్బారెడ్డి, శిరీషా, రత్నం, వరహాలు, ముద్దాడ పాపారావు, పి.ఐ.బాలరాజు, అర్జున్, మోహన్ పాల్గొన్నారు.

- జీవీఎంసీ 20వ వార్డు చినవాల్తేరులో 155వ నంబరు సచివాలయం వద్ద స్థానిక కార్పొరేటర్ మువ్వల లక్ష్మి వలంటీర్లతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మతో ర్యాలీ చేపట్టారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేసి, పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మువ్వల సురేష్, లక్ష్మణరెడ్డి, నరేష్, వెంకటరమణారెడ్డి, సాయి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

16వ వార్డులో..

మద్దిలపాలెం : వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ వైఖరిని ఖండిస్తూ 16వ వార్డులో వలంటీర్లు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చొల్లంగి నాగేశ్వరరావు, పోల రత్నం, తదితరులు పాల్గొన్నారు.



చినవాల్తేరులో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, వలంటీర్లు

ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నాం..



మేము మా పరిధిలో ఉన్న ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందేటట్టు కృషి చేస్తున్నాం. పింఛన్లు, జగనన్న ఇళ్లు, రేషన్ కార్డుల కోసం అర్హులైన వారితో దగ్గరుండి దరఖాస్తులు చేయించాను. వారికి ఎలాంటి ఖర్చు, శ్రమ లేకుండా పనులు చేయించాను. అలాంటి మాపై పవన్ కల్యాణ్ తప్పుగా మాట్లాడడం బాధగా ఉంది. దీన్ని అందరూ ఖండించాల్సిన అవసరం ఉంది.

– లీలాకృష్ణ, వలంటీరు, సచివాలయం-7, ఆపరేషన్ కాలనీ, ఆరిలోవ

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగవు



వలంటీర్లు మంచి సేవలు అందిస్తున్నారు. మేము ఆరిలోవ ప్రాంతం ఆపరేషన్ కాలనీలో నివాసముంటున్నాం. మా ఇంట్లో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందడానికి వలంటీర్ ఎంతో సహకరించారు. మా ఇంట్లో దివ్యాంగ పింఛన్ ప్రతి నెలా 1న ఉదయమే వచ్చి అందిస్తారు. వైఎస్సార్ ఆసరా, నా భర్తకు టైలర్ భృతి, జగనన్న ఇంటి కోసం మాతో దగ్గరుండి దరఖాస్తు చేయించి మంజూరు చేశారు. ఇలాంటి సేవలు అందిస్తున్న వలంటీర్లను పవన్ కల్యాణ్ నిందించడం మంచిది కాదు. వలంటీర్ వ్యవస్థ మాలాంటి వారికి ఎంతో అవసరం.

– శివదల పార్వతి, సంక్షేమ పథకాల లబ్ధిదారు, ఆపరేషన్ కాలనీ, ఆరిలోవ

18న భూలోకమాత పండగ



భూలోకమాత అమ్మవారు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలో కొలువైన శ్రీభూలోకమాత అమ్మవారి వార్షిక పండగ ఈ నెల 18న నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. గ్రామమంతా విద్యుత్ దీపాలంకరణలు చేస్తున్నారు. ఆలయానికి ఆనుకుని ఉన్న జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్లను సైతం విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఈ నెల 16న చాటింపు, 17న తొలేళ్ల పండగ, 18న అనుపు మహోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మినిస్టీరియల్ స్టాఫ్ సేవలు వెలకట్టలేనివి



సన్మాన గ్రహీతలతో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తదితరులు

మహారాణిపేట : మినిస్టీరియల్ విభాగం ఆస్పత్రి పరిపాలనకు గుండెకాయ వంటిదని, ఈ విభాగం శక్తివంతంగా ఉంటేనే ఆస్పత్రిలో అన్ని విభాగాలు సమర్థవంతంగా పని చేస్తాయని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అన్నారు. మంగళవారం కేజీహెచ్ ఆవరణలో బదిలీపై వెళ్లిన ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ నిబంధనలు సక్రమంగా పాటించాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి ప్రతి ఒక్కరు నిరంతరం కష్టపడి పని చేయాలన్నారు. సర్వీసులో ఉద్యోగులకు బదిలీలు సాధారణం అని కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్ అన్నారు. మినిస్టీరియల్ సిబ్బంది తెర వెనుక హీరోలని అన్నారు. అకౌంటెంట్ జోగిరాజు, మేనేజర్ ఎస్ఎస్‌శర్మ, అకౌంటెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను సన్మానించారు.

పవన్ కల్యాణ్‌పై పోలీసులకు ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ/బీచ్ రోడ్డు: వలంటీర్లను నేరస్తులుగా చిత్రీకరిస్తూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల సమక్షంలో తూర్పు నియోజకవర్గ వలంటీర్లు ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ సీఐ మల్లేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున వలంటీర్లు పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు ప్రతులపై వలంటీర్లు సంతకాలు చేసి సీఐకు అందజేశారు. అనంతరం పోలీసు స్టేషన్ సిబ్బంది వలంటీర్లకు ఫిర్యాదుపై రసీదును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మొల్లి అప్పారావు, అప్పారి గిరిబాబు, పుక్కళ్ల ధనలక్ష్మి, గుడ్ల సత్యారెడ్డి, వాసుపల్లి ఎల్లాజీ, సత్యవతి, జ్యోతి, కల్యాణ్, బడే ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

- పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో వలంటీర్లతో కలిసి వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 19, 20, 21, 22, 28 వార్డుల వలంటీర్లు పెద్ద సంఖ్యలో పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్లు మువ్వల లక్ష్మి, పల్లా దుర్గారావు, వెంకటలక్ష్మి దాస్, పీతల గోవింద్, ప్రసాదుల భాగ్యానంద్ పాల్గొన్నారు.



మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు, అక్కరమాని విజయనిర్మల

'మానవ వనరులుగా పెరిగిన జనాభా'



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య హరనాథ్..

ఆరిలోవ: దేశంలో పెరుగుతున్న జనాభాను మానవ వనరులుగా మలుచుకొంటే మేలు జరుగుతుందని ఏయూ సోషల్ వర్క్ విభాగాధిపతి, జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ తెలిపారు. ఏయూ స్టాటస్టిక్స్ విభాగంలోని జనాభా పరిశోధన కేంద్రంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరనాథ్ మాట్లాడుతూ భారతదేశ జనాభా చైనాను మించిపోయిందన్నారు. దేశంలో పెరుగుతున్న జనాభాను మానవ వనరులుగా మలుచుకొంటే జాతీయ సంపద పెరుగుతుందన్నారు. అంతే కాకుండా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. ప్రస్తుతం పెరుగుతున్న జనాభాను బట్టి 2050 నాటికి వృద్ధుల శాతం బాగా పెరిగిపోతుందన్నారు. రీ ప్రొడక్టివ్ హెల్త్ విషయంలో మహిళలకు నిర్ణయాధికారం ఉండాలని సూచించారు. వైవాహిక, గృహ హింసకు తావు ఉండకూడదన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. మహిళలు, బాలికలకు వృత్తి శిక్షణ కార్యక్రమాలు ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం, బాల్య వివాహాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయడం, ఉన్నత విద్యలో అవకాశాలు మెరుగుపరచడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షుడు ఆచార్య బి.మునిస్వామి, జనాభా పరిశోధన కేంద్రం సిబ్బంది డాక్టర్ యడ్ల రమణ, డాక్టర్ కె.శ్రీనివాసరావు, డి.అప్పారావు, ఎస్.ప్రసాదరావు, స్టాటస్టికల్ విభాగం పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: మార్పులు, చేర్పులు చేసి ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని బీఎల్‌వోలను సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఆనంద్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో జరగబోయే ఎన్నికల దృష్ట్యా బీఎల్‌వోలు పాత ఓటరు జాబితాతో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించాలన్నారు. అద్దె ఇళ్లల్లో ఉండే ఓటర్ల మార్పులు, చేర్పులు, చిరునామా మార్పులు వివరాలు సేకరించి కొత్తగా ఓటర్ జాబితా అప్‌డేట్ చేసి, అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణతోనే అభివృద్ధి సాధ్యం



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జనాభా నియంత్రణతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఈ ర్యాలీని జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు ప్రపంచ జనాభా 800 కోట్ల చేరువలో ఉండగా.. భారత్ జనాభా 142 కోట్ల చేరువలో ఉందన్నారు. రాష్ట్ర జనాభా 5 కోట్ల చేరువలో ఉందని చెప్పారు. జనాభా పెరగడంతో పేదరిక దేశంగా మారే ప్రమాదం ఉందన్నారు. పేదరిక నిర్మూలన భారత్‌లో దీర్ఘకాలిక లక్ష్యమని చెప్పారు. కుటుంబ నియంత్రణ పద్ధతులను ప్రోత్సహించాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఈ ర్యాలీలో ప్రోగ్రాం అధికారులు, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, వైద్య ఆరోగ్య కార్యాలయ సిబ్బంది, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

గడువులోగా పంటల ధ్రువీకరణ పత్రం సమర్పించాలి



నరసింహనగర్ రైతుబజార్‌లో మాట్లాడుతున్న ఏడీఎం యాసిన్

సీతంపేట: రైతులు తమ పొలాల్లో ఏయే పంటలు పండిస్తున్నారో వీఆర్వో, హార్టికల్చర్ ఆఫీసర్‌తో సర్టిఫై చేయించి గడువులోగా ధ్రువీకరణ పత్రం ఎస్టేట్ ఆఫీసర్‌కు అందజేయాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీఎం ఎస్.కె.యాసిన్ సూచించారు. నరసింహనగర్ రైతుబజార్‌లో మంగళవారం ఉదయం రైతులు, డ్వాక్రా సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టాల్‌లో ఉన్న రైతులంతా విధిగా గుర్తింపు కార్డులు ధరించాలన్నారు. డ్రా ద్వారా కేటాయించిన స్టాళ్లలో మాత్రమే రైతులకు కూరగాయల విక్రయలు జరపాలని, వినియోగదారులతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. తూకంలో ఎట్టి పరిస్థితుల్లో తేడా రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల్లోపు మారు వర్తకులు, హోటళ్లకు బల్క్‌గా కూరగాయలు విక్రయించకూడదని రైతులను ఆదేశించారు. రైతులు తమ కాటాలను ప్రతి సంవత్సరం గడువులోగా స్టాంపింగ్ చేయించుకోవాలని, బోర్డుపై నిర్దేశించిన ధరలకు కూరగాయలు విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, సహాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

అగనంపూడి సమస్యలపై ఎంపీకి వినతి



ఎంపీ ఎంవీవీ సత్యనారాణకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అగనంపూడి: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న టోల్‌గేటు తరలించాలని, 85, 88 వార్డులకు అనుసంధానంగా ఉన్న తలారివానిపాలెం అండర్ పాత్ వంతెనను విస్తరించాలని అగనంపూడికి చెందిన నాయకులు ఎంపీ ఎంవీవీ సత్యానారాయణకు వినతి పత్రం అందజేశారు.

రైతు బజార్ ఏర్పాటు చేయాలని, హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో స్థానికులకు ఉపాధి కల్పించాలని వినతిపత్రంలో కోరా రు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు బి.సత్యనారాయణ, ఎం.వి.రమణ, టి.రాము, ఎం.శ్రీను ఉన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యత



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: వాతావరణం వేడెక్కకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకుడు జేవీ రత్నం అన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఎకో వైజాగ్-మిషన్ లైఫ్స్ కార్యక్రమంపై ఎంవీపీ కాలనీలోని సెవెంత్ డే ఎడ్వెంటిస్ట్ స్కూల్‌లో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా స్కూల్ విద్యార్థులు ఎకో వైజాగ్ ప్లకార్డులు ప్రదర్శించారు.

ఈ సందర్భంగా జేవీ రత్నం మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కోసం పెద్ద ఎత్తున మొక్కలు నాటడమే సరైన మార్గమన్నారు. దీనిపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

23న ప్రజా సింహగర్జన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామచంద్రయాదవ్ తదితరులు

దాబాగార్డెన్స్ : బీసీలకు రాజ్యాధికారం వచ్చేలా త్వరలో నూతన పార్టీ ఆవిర్భావం జరుగుతుందని బీసీ జాతీయ నేత బోడే రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్లో మంగళవారం అనకాపల్లి జిల్లా భారతీయ యాదవ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ మొల్లి సన్నిబాబు నిర్వహించిన నూతన పార్టీ ఆవిర్భావ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న దళిత, బహుజన, రైతు, శ్రామిక, మైనార్టీ, వెనుకబడిన కులాల రాజ్యాధికారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రజా సింహగర్జన నిర్వహించనున్నట్టు చెప్పారు. గుంటూరు..విజయవాడ జాతీయ రహదారి నాగార్జున విశ్వ విద్యాలయం ఎదురుగా నిర్వహించనున్న ప్రజా చైతన్య వేదికకు పెద్ద ఎత్తున ఆయా వర్గాల ప్రజలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా ఉంటూ రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నమ్మి అప్పలరాజు, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కిలాడి అప్పలరాజు తదితర బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికుల భిక్షాటన



పెదగంట్యాడ జంక్షన్‌లో భిక్షాటన చేస్తున్న గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: గంగవరం పోర్టు నిర్మాణం జరిగితే గంగవరం, దిబ్బపాలెంలోని మత్స్యకారుల బతుకుల్లో వెలుగులు వస్తాయని అనుకున్నామని, కానీ అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం కార్మికులను ఇలా బిచ్చగాళ్లను చేస్తుందని అనుకోలేదని గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు అన్నారు. జీతాలు పెంచాలని కోరుతూ గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు మంగళవారం 8వ రోజుకు చేరుకున్నాయి.

ఈ ఆందోళన కార్యక్రమంలో భాగంగా కార్మికులంతా కలిసి పాత గాజువాక జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. పోర్టు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పాత గాజువాక జంక్షన్ నుంచి పెదగంట్యాడ వరకూ భిక్షాటన చేశారు.

విశాఖ ఉక్కును కాపాడుకుంటాం



దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికులు పట్టువదలక ఉక్కు పరిశ్రమ కోసం నిద్రాహారాలు మాని పోరాటం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ప్రశ్నించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే దీక్షలు మంగళవారం నాటికి 880వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని డిమాండ్ చేశారు. ఉక్కు పోరాటం మొదలుపెట్టి 880 రోజులు గడుస్తున్న కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ఇంత చిన్నచూపు చూడడం సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశ పెట్టాలని, లేకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.